స్వరూపకు నిద్రపట్టడం లేదు.

రాత్రి రెండయిపోయింది.

'పారడైజ్ లాస్ట్' చేతుల్లోనే వుంది కాని మనసు దానిమీదకు పోవడంలేదు. రేపు 'పారడైజ్ లాస్ట్' చెప్పాలి క్లాసులో. కానీ మనసు దానివేపు చూడ్డానికి కూడా ఒప్పుకోవడం లేదు.

శాంత గుర్తు కొస్తోంది. కిందటి సంవత్సరం ఈ పండక్కి ఆమె తన కెదురుగా వున్న క్వార్టర్స్‌లో తనలాగే ఒంటరిగా వుంది. ఈ యేడు పాపాయిని కని భర్తతో సుఖంగా.

❊

"అదేమిటే—అలా పడుకునే వున్నావేమిటి? స్టేషన్ కొస్తానన్నావుగా నాతో" అంది శాంత ఇంట్లో కొస్తూ.

"ఈసారి నువ్వు వూరెళ్తా వుంటే నాకు భయంగా వుంది." అంది స్వరూప.

"ఎందుకు"

"పెళ్ళి సెటిల్ చేసుకు వస్తావేమోనని?"

శాంత నవ్వేసింది.

"లేకపోతే ఇలా లోన్లీగా ఎంతకాలం గడప మంటావ్?"

స్వరూపను కదలించి వేసిందామాట.

అవును. ఎందుకు గడపాలీ ఒంటరి జీవితం? తను లోలోపల ఈ ఒంటరి తనాన్నుంచి తప్పించుకోవాలని ఎంతగా ప్రయత్నిస్తోందో—శాంత కూడా అలాగే ప్రయత్నిస్తూండి వుంటుంది. కానీ ఆ విషయం ఎప్పుడూ ఎవరూ వ్యక్తం చేయలేదు.

తనూ, శాంతా, రేణుకా, వసంతా—

మాట్లాడ్డానికి వీల్లేనంతటి సున్నితమయిన విషయం అది. ఒంటరితనం – నిజంగా అది శిక్ష?

కొన్నాళ్ళక్రితం శ్రీరామ్ పరిచయమయ్యేవరకూ తనకు తనను చుట్టుముట్టిన ఒంటరితనం గురించి తెలీదు.

"ఒంటరిగా గడపడం నిజంగా పెద్ద పనిష్మెంట్...." అన్నాడతను మొదటిసారి తన క్వార్టర్స్‌కి వచ్చినప్పుడు.

తనకు అప్పుడు అర్థం కాలేదతని మాటలు.

"ఇందులో పనిష్మెంట్ ఏముంది?" అంది ఆశ్చర్యంగా.

అతను నవ్వాడు.

"బహుశా ఇంకొంత కాలం తర్వాత తెలుస్తుందేమో మీకా విషయం...."

తనేమీ మాట్లాడలేదు.

"పద! ట్రైన్‌కి టైమవుతోంది ..." అనేసి



# పారడైజ్ లాస్ట్

—శీలంశెట్టి రమాదేవి

తనింట్లోకి వెళ్ళిపోయింది శాంత హడావుడిగా.

ఆలోచనల్లో నుంచి బయటపడి లేచి రెడీ అవసాగిందామె.

స్నానం ముగించేసరికి శాంత 'టీ' తీసుకొచ్చి ఇచ్చిందామెకి.

'టీ' తాగేసరికే అర్జున్ రిక్షా తీసుకొచ్చేశాడు.

సూట్‌కేస్ తీసుకుని రిక్షాలో కూర్చుంది శాంత.

తనూ తలుపుకి తాళం వేసి వెళ్ళి ఆమె ప్రక్కన కూర్చుంది స్వరూప.

స్టేషన్ చేరుకుని ఇద్దరూ మీటర్‌గేజ్ ప్లాట్‌ఫారం మీద కెళ్ళారు. ట్రైన్ ప్లాట్‌ఫారం మీదే వుంది.

"ఏ కోచ్ నీది?" అడిగింది స్వరూప.

"'సి' కోచ్......"

"'సి' కోచ్ చేరుకున్నారు. సైడ్ బెర్త్ మీద సూట్‌కేస్ వుంచింది శాంత.

"నెక్స్ట్ మండే తప్పక వచ్చేస్తావుగా?"

"డెఫినెట్...."

"ఇంతకూ మీబావ మరి కల్టివేషన్ వదిలి నీతోపాటు ఏదోక ఉద్యోగం చేస్తూ ఇక్కడ వుండడానికి వప్పుకున్నాడా?"

"అదే క్లియర్‌గా తెలీదు. అన్నీ మాట్లాడదాం, రమ్మని రాశాడు!"

"అంటే ఇంతకు ముందెప్పుడూ మాట్లాడలేదా-అన్ని విషయాలూ?"

"నో—నేను క్లియర్‌గా చెప్పేశానప్పుడు-నేను ఉద్యోగం వదలి అతని ఊళ్ళో ఉండడం మాత్రం జరగదని! అందుకే సంవత్సరంపాటు ఇద్దరికీ సంబంధాలు తెగిపోయాయ్" నవ్వుతూ అందామె.

ట్రైన్ కదిలే వరకూ అతని గురించే మాట్లాడుతోందామె.

ఆమె మాటలనుబట్టి తెలుస్తూనే ఉంది - ఒకరంటే ఒకరికి ఎంత యిష్టమో—

మార్కెట్‌లో నుంచి కాంపస్ వేపు నడవసాగింది స్వరూప. చాలా రద్దీగా ఉందా రోడ్డు. పండుగకు ఇంకా రెండు మూడు రోజులున్నా ఇప్పుడే ఆ ఉత్సాహం వెల్లివిరుస్తోందంతా.

రిక్షాల్లో సినిమాలకు వెళ్తోన్న జంటలూ, షాపింగ్ కోసం మార్కెట్‌కొచ్చిన జంటలూ, చూస్తూంటే – తన ఒంటరితనం వేయింతలై కనబడుతున్నట్లుంది. కొంతదూరం నడిచేసరికి రద్దీ తగ్గిపోయింది. దూరంగా కాంపస్ లైట్లు ఎంతో

దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తున్నాయ్. కానీ అక్కడికి చేరుకోవాలంటే అరగంటసేపు నడవాలింకా!

ఇంతవరకూ ఎప్పుడూ కాంపస్‌కి నడిచి వెళ్ళలేదు. కానీ ఇప్పుడు నడిచి వెళ్ళాలనిపిస్తోంది. ఇంటికి ఎంత ఆలస్యంగా వెళ్తే అంత బావుంటుందని వుంది. నిద్ర వచ్చేంతవరకూ ఈ రద్దీలో – అందరి మధ్యా తిరుగుతూ, గడిపేసి అప్పుడు ఇంటికెళ్ళి నిద్రపోవాలని వుంది.

కాంపస్‌లోకొచ్చేసరికి నలభై అయిదు నిముషాలు పట్టింది. కాళ్ళు నొప్పులు పుట్టసాగినయ్. ఇంతదూరం బహుశా ఏ రోజూ నడిచి ఉండదు.

తలుపు తాళం తీసి లోపలకు నడిచిందామె.

బయటికి పోయే దారిలేక గది లోపల ఇరుక్కుపోయిన గాలి–ఓ వింత వాసన కొడుతోంది.

కిటికీ తలుపులు తెరచిందామె.

చల్లనిగాలి విసురుగా లోపలకు జొరబడింది.

కిచెన్‌లోకి వచ్చి డైనింగ్ టేబుల్ ముందు కూర్చుందామె.

ప్రొద్దున్న వండిన వంటే–

అన్నీ చల్లగా అయిపోయాయ్.

వేడి చేయాలంటే బద్ధకం వేసిందామెకి. శాంత ఉన్నట్లయితే రాత్రుళ్లు ఆమె ఏదో ఒక కూరవండి తనకు సప్లయ్ చేస్తూండేది.

అలాగే నాలుగు ముద్దలు తిని చేయికడుక్కుందామె.

డ్రాయింగ్ రూమ్‌లో కొచ్చేసరికి అర్జున్ సోఫాలో కూర్చుని డైజెస్ట్ చదువుతూ కనిపించాడు.

"ట్రైన్ టైముకి వెళ్ళిందాండీ?" అడిగాడతను.

"ఓ!...."

"మీరు చాలా ఆలస్యంగా ఇంటికొస్తేనూ–ఒక వేళ బండి లేటుగా స్టార్టయిందేమోనని అనుకున్నాను...."

"స్వరూప రేడియో ఆన్ చేసింది. విజయవాడ వివిధ భారతి బలహీనంగా వినబడుతోంది.

"మీ బాంక్ ఎగ్జామినేషన్ ఎప్పుడు?" అడిగింది స్వరూప అతని కెదురుగా కూర్చుంటూ.

"వచ్చే ఆదివారం?"

"ఆ తరువాత–ఇక్కడే ఉంటున్నారా?"

"ఊహూ – ఇక్కడ నాకేం తోచడం లేదండీ–మా ఇంటి కెళ్ళిపోతాను..."

స్వరూప నవ్వింది.

"రేపు ఉద్యోగం వచ్చినా ఇలాగే అంటారా?"

అతనూ నవ్వాడు.

"అప్పుడింక ఎలాగూ తప్పదు కదా!"

అతను వాళ్ళూరులోనే బి.కామ్ పూర్తి చేశాడు. ఇంకా చదవడం ఇష్టం లేక ఉద్యోగాల వేట ప్రారంభించాడు. ఎలాగూ ఉద్యోగాల వేటలో ఉన్నాడు కాబట్టి కొద్ది రోజులు వాళ్ళక్కయ్య దగ్గర గడపాలనిపించి శాంత దగ్గరకు వచ్చాడు. వచ్చి రెండు నెలలవుతోంది. రోజూ ఉదయం ఊళ్ళోకి వెళ్ళి లైబ్రరీలో న్యూస్ పేపర్స్‌లో వాంటెడ్ కాలమ్స్ చూడడం, సాయంత్రం మెన్స్ కాలేజీలో కాసేపు వాలీబాల్ ఆడిరావడం! ఇదే అతని దినచర్య.

వాలీబాల్‌లో అతనికి చాలా ప్రావీణ్యం ఉంది. ఇంటర్ కాలేజియేట్‌లో వాళ్ళ కాలేజ్ టీమ్ కేప్టెన్‌గా ఉన్నాడు. చాలా సర్టిఫికెట్లున్నాయ్, అతని దగ్గర.

"భోజనం చేశారా?" అడిగింది స్వరూప.

"ఇంకా లేదండీ! ఒక్కడినీ చేయాలంటే బోర్‌గా ఉంది. మీరు నమ్ముతారో లేదో ఇంతవరకూ ఏనాడూ ఒంటరిగా భోజనం చేయలేదు నేను. ఇవాళ మొదటిసారి–ఇలాంటి పరిస్థితి రావటం..." నవ్వుతూ అన్నాడతను.

స్వరూప విచిత్రంగా చూసిందతని వేపు.

మరి కాసేపు కూర్చున్నాక "వస్తానండీ మీ నిద్ర కూడా చెడగొట్టడం ఎందుకు?" అంటూ లేచి వెళ్ళిపోయాడు. తలుపులు మూసివేసి బెడ్ రూమ్‌లోకొచ్చి పడుకుందామె.

పక్కనే టీపాయ్ మీద 'టేల్ అఫ్ టు సిటీస్' ఉంది. రోజూ కాసేపు అందులో ఏవో కొన్ని పేజీలు చదవడం ఇష్టం తనకి.

రెండు పేజీలు చదివేసరికి నిద్ర ముంచుకొచ్చింది.

లైటార్పి కళ్ళు మూసుకుందామె.

శ్రీరామ్ కళ్ళముందు కనిపించాడు హఠాత్తుగా.

ఇప్పుడెక్కడున్నాడో?

నాలుగేళ్ళయి పోతోంది. అతను కనిపించి.

ఈ ఊళ్ళో వుంటే తప్పక కని పించి వుండేవాడు. తనలా మాట్లాడకపోయి వున్నట్లయితే— తనలా ప్రవర్తించకపోయి వున్నట్లయితే. ఏం జరిగి వుండేది?

ఏమో!

అసలు తనెందుకలా గాయపరచింది అతనిని? అతనంటే తనకిష్టం లేకపోయినట్లయితే—ఆ విషయం మరోలా తెలియజేసి వుండవచ్చు?

"సారీ శ్రీరామ్ — ఐకాన్ట్‌మారీయు" అని చెప్తే సరిపోయేది. కాని తనలా చేయలేదు. అతనిని గాయపరిచింది. అతని కులం ప్రసక్తి తెచ్చి అతనిని హీనపరచి మాట్లాడింది.

అలా చేయడంలో అంతరాంతరాల్లో తనకేదో ఆనందం లభించింది. అతనిలాంటి అందగాడి మీద తన ఆధిక్యత బుజాయించుకోవాలని అలా ప్రవర్తించిందా? అతనికున్న అర్హతలన్నీ తను ఎంత చిన్న చూపు చూడగలదో తెలియజేయడానికి అలా ప్రవర్తించిందా? ఏమో! తనకే తెలీదు.

అప్పుడు అతను చూసిన చూపుమాత్రం తనేనాటికీ మర్చిపోలేదు.

తుపాకి దెబ్బతిన్న పక్షి ఎలా చూస్తుందో తనకు తెలీదు, కానీ దానిచూపు అతను చూసిన చూపులా వుంటుందనిపించింది.

"ఓకే స్వరూపా! అయామ్‌సారీ! ఈ కులాలూ మతాలూ - ఇవన్నీ ఆ జెనరేషన్‌కి చెందినవి అనుకున్నాను. అయామ్ రాంగ్! దే నెవర్ చేంజ్!" అన్నాడతను.

అంతే! ఆ తరువాత మళ్ళీ కనిపించలేదు.

మోటర్‌సైకిల్ శబ్దం వినిపించనంతవరకూ– తనలాగే కదలిక లేకుండా కూర్చుండిపోయింది.

తల్లిదండ్రులు సంబంధాలు చూడసాగారు.

ఎన్ని—?

తనకే లెఖ్ఖలేదు.

కొన్ని వాళ్ళకు నచ్చనివి – కొన్ని తనకు నచ్చనివి!

అన్నీ డబ్బుతో ముడిపడినవే! డాక్టర్లు, ఇంజనీర్లు, పెద్ద పెద్ద పదవుల్లో ఉన్న అధికారులు–అందరూ డబ్బు గురించి మాట్లాడినవారే - తన గుణగణాల గురించీ ఒక్కరు కూడా పట్టించుకోలేదు. అదే తనకు విపరీతమయిన బాధ కలిగించిన విషయం. జీవితంలో చిరకాలం కలిసి అన్నీ అనుభవించాల్సిన భార్యా భర్తల్లో–భార్య విలువ అదా!

ఆ సమయంలోనే చలపతి కనిపించాడు. ఇద్దరూ ఫోర్త్‌ఫారమ్ నుంచీ యస్సెల్సీవరకూ ఒకేచోట ట్యూషన్ కెళ్ళేవారు. అంచేత ఎంతో స్నేహం, చనువు ఏర్పడింది.

వాళ్ళ కంపెనీ తాలూకు కొత్త బ్రాంచి ఆ ఊళ్ళో ప్రారంభించారట. అందుకని ఆరు నెలల పాటు అక్కడ స్టెనోగా పని చేయడానికి డెప్యుటేషన్‌లో వచ్చారు.

సినిమా ఇంటర్వెల్‌లో కనిపించడం వల్ల ఎక్కువసేపు మాట్లాడ్డానికి వీల్లేకపోయింది.

"మీ ఇల్లు ఎక్కడ?" అడిగాడతను.

"కాంపస్‌లోనే క్వార్టర్స్! ఎఫ్-ఫోర్!"

"ఓ-కే. సండే వస్తాను" వెళ్ళిపోయాడతను.

అతనంటే ఆ రోజుల్లో ఎంతో ఇష్టం తనకి. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూండేవాడు. ఆ ఇష్టం గుండెల్లో అలాగే ఉండిపోయింది.

తను కాలేజీలో చేరాక అతను చాలా తక్కువ సార్లు కనిపించాడు. అతను కాలేజీలో చేరలేదు. చదివే స్తోమతులేక ఉద్యోగాన్వేషణలో పడ్డాడు.

తను పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నప్పుడు ఆఖరిసారి కనబడ్డాడు. ఉద్యోగం చేస్తూనే టైపు పరీక్షలు పాసయినట్లూ, మరో కంపెనీలో స్టెనోగ్రాఫర్ ఉద్యోగానికి ప్రయత్నిస్తున్నట్లూ చెప్పాడు.

ఆదివారం అతను వచ్చాడు.

చాలాసేపు తనతోపాటు ట్యూషన్ చదివిన మిగతా వారందరి గురించీ మాట్లాడుకున్నారు.

"అయితే మీరింకా పెళ్ళి చేసుకోలేదన్న మాట?" అన్నాడతను.

"ఊహూ! మీకయిందా?" అడిగిందామె.

"లేదండీ! ఆ ప్రయత్నాల్లోనే ఉన్నారు మావాళ్లు ఇప్పుడు...."

"ఓ...."

ఆ రోజునుంచీ అతను తరచుగా ఇంటికిరావడం రెండు మూడు గంటల పాటు ఏవేవో విషయాలు మాట్లాడుతూ గడిపి వెళ్ళడం మామూలయిపోయింది. ఆ ఆరునెలలలో అతనితో ఎంతో ఆత్మీయత ఏర్పడిపోయింది. అతనిలో అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమీ కనిపించలేదు. అప్పటిలానే నవ్వుతూ, నవ్విస్తూ – రోజంతా అతనితో మాట్లాడుతూ - అతని మాటలు వింటూంటే బాగుండుననిపిస్తుంది.

అతని డెప్యూటేషన్ పీరియడ్ అయిపోయింది.

"రేపు వెళ్ళిపోతున్నాను - మీ ఊరినుంచి" అన్నాడతను ఆ రోజు వచ్చినప్పుడు.

"అప్పుడే ఆరునెలలయిపోయిందా?' ఆశ్చర్యంగా అడిగింది తను.

"అవును! మీ కంపెనీ దొరకడంవల్ల నాకే తెలీలేదు–ఆరు నెలలు గడిచిపోయినట్లు...."

కొద్దిసేపు మౌనంగా ఉండిపోయారిద్దరూ.

లోలోపల స్వరూపకు ఆవేదనగానే ఉంది.

అతని స్నేహంలో తను అంతవరకూ తన వివాహ విషయంలో ఎదురవుతూన్న సమస్యల గురించి ఆలోచించడం, బాధపడడం నుంచి తప్పించుకోగలిగింది.

తను ఒంటరిది అన్న విషయమూ అంతగా గుర్తురాలేదీ మధ్య.

ఉదయం నుంచీ సాయంత్రం వరకూ కాలేజ్. సాయంత్రం రెండు మూడు గంటలు అతనితో కాలక్షేపం, ఆ తరువాత శాంతతో కాసేపు గడపడం నెక్ట్స్ డే క్లాసెస్‌కి ప్రిపేరవడం–మరో ఆలోచనకే టైముండేది కాదు.

చీకటి అలుముకు పోతోంది.

"ఇదే ఆఖరిరోజు మీకు కనబడడం – రేపు సాయంత్రం ట్రైన్‌కెళ్ళిపోతున్నాను" అన్నాడతను.

"మీరు లేకపోతే పెద్ద లోటే...." అంది తనూ బాధగా.

"నాకేమనిపిస్తోందో తెలుసా స్వరూపా! జీవితాంతం మీ దగ్గరే ఉండిపోవాలనిపిస్తోంది."

అతని మాటల్లోని అంతరార్థం ఛటుక్కున స్ఫురించింది తనకు.

ఆ క్షణంలో తన గుండెలు వేగంగా కొట్టుకున్నాయ్.

అతను....తనను...ప్రేమిస్తున్నాడా?

ఏమో! ప్రేమిస్తూండవచ్చు. ఇద్దరి మధ్య ఇంత సాన్నిహిత్యం ఏర్పడ్డాక అందులో అసాధారణమేముందీ?

మరి తన సంగతేమిటి? తనూ ప్రేమిస్తోందా అతనిని—

అతనంటే ఇష్టం ఉంది తనకి. అతనిలో ఏ లోపమూ లేదు.

అన్నిటికన్నా ముఖ్యమయిన విషయం అతను తన వ్యక్తిత్వానికి విలువనిస్తున్నాడు.

తనను కోరుకుంటున్నాడు. తన డబ్బు కోసం తనని కావాలనుకోవడం లేదు.

"స్వరూపా!" నెమ్మదిగా పిలిచాడతను.

"ఊ!"

"ఎన్నో రోజులుగా చెప్పలేకపోయిన విషయం ఇవాళ ధైర్యం చేసి చెప్పేస్తున్నాను. ఎందుకంటే నా మనసు విప్పి మీతో ఇవాళ మాట్లాడలేక పోయినట్లయితే ఇంకెప్పటికీ ఈ అవకాశం రాదేమో!"

తను గుండెలు బిగపట్టుకుని వింటోంది.

"అయ్ లవ్ యూ స్వరూపా! మీకు అంగీకారమయితే మనం వివాహం చేసుకుందాం."

స్వరూప ఏమీ మాట్లాడలేదు. అతనింకా అలా ప్రవాహంలా మాట్లాడుతూంటే బావుండుననుంది.

కానీ ఇప్పుడతనికి తనేమని సమాధానం చెప్పాలి?

అసలు తన మనసులో ఉన్న విషయం ఏమిటి? అతని గురించి తన అభిప్రాయం ఏమిటి?

అతనిలో ఒకే ఒక్క లోటు కనబడుతోంది. ఆ ఒక్క లోటే తనను, బలవంతంగా అతనికి కొద్ది దూరంలో ఆపివేసింది తనను. అతని ఆకర్షణలో పడకుండా వెనక్కులాగి పట్టింది.

అతని క్వాలిఫికేషన్ ఏమిటి?

కనీసం గ్రాడ్యుయేట్ కూడా కాదు! మెట్రిక్యులేషన్! తను లెక్చరర్! అంటే గెజిటెడ్ ఆఫీసర్!

అతను టైపిస్ట్.

ఎలా కుదురుతుంది తమకి?

ఈ తేడాలు తమ జీవితంలో చికాకులు కలిగించవూ?

అసలు నలుగురిలో తనకు మాత్రం చిన్నతనంగా ఉండదూ?

"సారీ చలపతీ - దటీజ్ నాట్ పాజిబుల్...."

అతను బాధగా ఆమె వేపు చూశాడు.

మరి కాసేపు మౌనంగా కూర్చున్నాడు. అలా చెప్పేసింది కానీ ఆ తరువాత పశ్చాత్తాపం ప్రారంభమయింది స్వరూపలో!

అతను ఆ ఒక్క అంశం తప్పిస్తే మిగతా అన్ని విధాలా తనకునచ్చాడు. మరి ఆ ఒక్క దాంట్లో తను రాజీ పడితే తప్పేముంది?

అతను లేచి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

"ఓకే స్వరూపా! 'నా లక్' బావుండలేదు. వస్తాను...."

వెళ్ళిపోయాడు.

ఆ రాత్రీ, మర్నాడు క్లాసులోనూ ఎడతెరిపిలేని ఆలోచనలు. ఆ సాయంత్రం స్టేషన్‌కెళ్ళి అతనికి సారీ చెప్పి, వివాహానికి అంగీకారం తెలియజేయాలన్న తపన—

కానీ స్టేషన్‌కెళ్ళలేదు.

ఇంటికొచ్చి తలుపులన్నీ వేసుకుని చీకట్లో మంచంమీద పడుకుండిపోయింది.

రాత్రి పదింటికి శాంత నిద్రలేపేవరకూ మెలకువ రాలేదు.

"ఏమిటి-భోజనం చేయకుండా పడుకున్నావ్? వంట్లో బావుండలేదా?" అడిగిందామె.

"బాగానే ఉంది...." అనేసి నాలుగు మెతుకులు తిని మళ్ళీ పడుకుంది.

తెల్లారేవరకూ కంటిమీద కునుకే రాలేదు.

ఆ రోజునుంచీ తీవ్రమయిన అశాంతి!

ఇంకా సంబంధాలు చూస్తూనే ఉన్నారు తల్లిదండ్రులు. ఇప్పుడో కొత్త సమస్య ఎదురయింది తనకి.

కట్నంతోపాటు పెరిగిపోతున్న వయసు—

వయసువల్ల చాలా సంబంధాలు రద్దయిపోయాయ్—

కొద్ది రోజులపాటు తను అశాంతితో కుమిలిపోయింది. ఆ తర్వాత నెమ్మదిగా కోలుకుంది.

అందుకు చాలావరకూ శాంతే కారణం. అవును. తనేకాదు. తనకు తోడుగా మరో ఒంటరిజీవి శాంత వుంది. మరికొంత మంది తోటి లెక్చరర్లున్నారు– రేణుక, వసంత, - వారిద్దరికీ కూడా వివాహం కాలేదు.

ఎవరికీ లేని భయం. ఆ వేదన తనకెందుకు?

మధ్యాహ్నం పన్నెండవుతుండగా తలుపు తట్టాడు అర్జున్.

తలుపు తెరవగానే లోపలకొచ్చి కుర్చీలో కూర్చున్నాడు, మాగజైన్స్ అందుకుని.

"ఏం చేస్తున్నారు? భోజనం అయిపోయిందా?" అడిగాడతను.

"ఇవాళ వంటాలేదు. ఏమీలేదు. ఒకటే బద్ధకంగా వుంది...." అందామె.

"అయ్యో! మరి భోజనం. ఎలా?"

"ఒక పూట లేకపోతే ఏం మునిగిపోదు లెండి...."

"నోనో - నేనెలాగూ హోటల్కెళ్తున్నాను భోజనానికి మీదగ్గర టిఫిన్ కేరియర్ వుంటే ఇవ్వండి. తీసుకొస్తాను...."

"మధ్యలో మీకెందుకు శ్రమ?" మొహమాటంగా అందామె.

"శ్రమల్లో రెండు రకాలుంటాయ్ - ఆనందం కలిగించేవి, బాధకలిగించేవి. మీకు సహాయం చేయడం మొదటి తరగతిలోకి వస్తుంది." నవ్వుతూ అన్నాడు. మరో గంటన్నర తరవాత భోజనం తీసుకొచ్చి ఇచ్చాడతను.

ఆమె కిచెన్‌లో భోజనం చేస్తూంటే అతను హాల్లోనే కూర్చున్నాడు.

"ఇక్కడ మహాబోర్‌గా వుందండీ! మాఅక్క రాగానే మళ్ళీ మా వూరు వెళ్ళిపోతాను." అన్నాడు కొద్దిసేపటి తర్వాత.

"అక్కడ మాత్రం ఏంతోస్తుంది మీకు?"

"అక్కడ మా ఫ్రెండ్స్ వుంటారుకదా! అదీగాక వాలీబాల్ టోర్నమెంట్స్‌కు బిజీగా తిరుగుతూనే వుంటాం."

స్వరూప ఏమీ మాట్లాడలేదు.

"అసలు ఎప్పుడో వెళ్ళిపోయే వాడినండి! కానీ ఒక కారణం వల్ల ఆగిపోయాను."

ఆమె వంకే చూస్తూ అన్నాడతను.

"ఏమిటది?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"మీరేమీ అనుకోనంటే చెప్తాను..."

స్వరూప చకితురాలయింది.

"నేననుకునేందుకేముందీ?"

"నేను ఫ్రాంక్‌గా మాట్లాడతాను. అఫెండ్ అవకండి. నేను ఇక్కడి కొచ్చిన మొదటి రోజే మిమ్మల్ని చూసి ప్రేమించాను. మీ అందం నన్ను విపరీతంగా ఆకర్షించింది. ఎలాగయినా మీతో పరిచయం పెంచుకోవాలనీ, మీతో కూడా ప్రేమింపబడాలనీ అనుకున్నాను; మీరు ఒప్పుకుంటే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలని నా ఉద్దేశం! ఇలా మీతో మాట్లాడే అవకాశం కోసమే ఎదురు చూస్తున్నానిన్నాళ్ళూ..."

స్వరూప ఉక్కిరిబిక్కిరయిపోయింది.

ఏమిటీ విచిత్రం?

అతను తన కంటె నాలుగయిదేళ్ళ చిన్నవాడు. మరి తనను ప్రేమించడం ఏమిటి? పెళ్ళి చేసుకోవడం ఏమిటి?

"మీకేం మతిపోలేదు కదా? మీ వయసేమిటి-నా వయసేమిటి?" అందామె కొద్దిక్షణాల తర్వాత కోలుకుని.

"అదంతా ట్రాష్! నాలుగయిదేళ్ళు అటూ ఇటూ అయితే కొంప మునిగిపోయిందేమీ లేదు... ఎక్కడా మగాడికే ఎక్కువ వయసుండాలని రాసి పెట్టలేదు. అదీగాక జరిగే పెళ్ళిళ్ళల్లో ఆడపిల్ల వయసులన్నీ అబద్ధాల వయసులే! నాక్కావలసింది ఈ వయస్సు తేడాల గురించి వాదన కాదు. మీకు మన మధ్య అలాంటి బంధం ఏర్పడటం ఇష్టమా, కాదా–అది చెప్పండి...."

"యూ ఆర్ క్రేజీ! అయ్ డోన్ట్ వాన్ట్ టు టెల్ ఎనీథింగ్...." చిరుకోపంతో అందామె.

"ఓ కే-ఆలోచించి చెప్పండి. నేనుండేది మరో రెండు రోజులే ఇక్కడ—" అతను లేచి వెళ్ళిపోయాడు.

స్వరూప నిశ్చేష్ఠురాలయి ఉండిపోయింది చాలాసేపు. జరిగింది తల్చుకుంటే తమాషాగా ఉందామెకు.

మిగతా రెండు రోజులూ అతను కనిపించనే లేదు తనకు. బహుశా తనను చూడడానికి సిగ్గుపడుతూండి ఉంటాడు.

ఆ మర్నాడు శాంత ఊరి నుంచి వచ్చేసింది.

"మారేజ్ సెటిల్ అయిపోయిందే...." అంది ఆనందంగా.

"ఎలా?"

"ఎలాగేముంది? నేనీ ఉద్యోగం వదిలేసి మా ఊరికి దగ్గర్లో ఏదయినా కాలేజీలో ఉద్యోగం కోసం ప్రయత్నించాలి...."

"మరి పెళ్ళెప్పుడు?"

"వచ్చే నెలలో."

"అంటే అతనే గెలిచాడన్నమాట!"

"ఎలా అనుకున్నా సరే."

స్వరూప మనసంతా ఆదోలా అయిపోయింది. తనకున్న ఒకే ఒక్క తోడు కూడా పోతోంది.

ఆ రోజు మధ్యాహ్నం ఫస్టవర్ లేకపోవడంతో ఇంటి దగ్గరే ఉండిపోయింది. శాంత కాలేజీకెళ్ళిపోయింది.

అర్జున్ వచ్చి తన కెదురుగా కూర్చున్నాడు.

"ఇవాళ సాయంత్రం వెళ్ళిపోతున్నాను—"

అన్నాడతను ఆమె వంక చూడకుండానే.

స్వరూప ఏమీ మాట్లాడలేదు.

"వెళ్ళేముందు మీతో చెప్పాలనిపించింది."

"విష్ యూ హాపీ జర్నీ..." అంది స్వరూప.

"థాంక్ యూ...." అని లేచి వెళ్ళిపోయాడతను.

రోజులు గడచిపోతున్నాయ్.

శాంత వివాహం అయిపోయింది. రేణుక వివాహం అయిపోయింది. లవ్ మారేజ్ — కులాలు వేరు – ఇంట్లోవాళ్ళెవరూ రాకుండానే వాళ్ళ వివాహం రిజిష్ట్రారాఫీసులో జరిగిపోయింది.

వసంత వివాహితుడయిన ఓ యువకుడితో ప్రేమలో పడింది.

జీవితాంతం అతనితో అలాగే గడిపేయ దల్చుకున్నానని అందామె. ఆమె ఒంటరితనానికి అదో సమాధానంగా భావించింది.

తనొక్కర్తే మిగిలిపోయింది.

తనూ–తన ఒంటరితనం—

ఎందుకని?

మారుతున్న కాలంతోపాటు తనూ మారలేకపోతోందా? ఇంకా పాతకాలం నాటి ఆచారాలు, పద్ధతులు, ఆలోచనల నుంచి బయటపడలేకపోతోందా?

*

స్వరూప చేతిలోని పుస్తకం జారి కిందపడిపోయింది.

చటుక్కున వంగి అందుకుందామె.

"పారడైజ్ లాస్ట్...."

అవును–అయ్‌లాస్ట్ మై పారడైజ్....

ఆ పుస్తకాన్ని గుండెలకు హత్తుకుందామె-కళ్ళు మూసుకుని— ●